క్లుప్తంగా

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

కె.గంగవరం: విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని ఎంఈఓ ఎ.నాగరాజు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీల నిర్వాహణకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముందుగా పాఠశాల స్థాయి క్రీడా పోటీలు పూర్తి చేసి అనంతరం సెప్టెంబర్ 15, 16 తేదీల్లో పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డివిజన్, జిల్లా స్థాయిలో అవకాశం పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పాడగట్లపల్లి వెంకటేశ్వరరావు, పలు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిషేధ ఉత్తర్వులు రద్దు చేయాలి



పసుమర్తి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: సర్వీస్ ఇనాం భూముల క్రయ విక్రయాలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నిషేధ ఉత్తర్వులను రద్దు చేయాలని వైస్ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు పసుమర్తి నాగేశ్వరరావు బుధవారం డిమాండ్ చేశారు. రాజరిక వ్యవస్థ కాలంలో వివిధ కుల వృత్తిదారుల సమూహాలకు మాన్యాలుగా దానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మారిన నేటి కాల పరిస్థితుల నేపథ్యంలో కుల వృత్తుల ప్రాధాన్యత సన్నగిల్లిందన్నారు. వృత్తి ఆధారిత ఆదాయం లేని నేపథ్యంలో ఇనాం భూములను కుటుంబ అవసరాల కోసం క్రయ విక్రయాలు జరుపుకుంటున్నారన్నారు. 1954లో సర్వీస్ ఇనాం భూములను అప్పటి ప్రభుత్వం రైతు వారి భూములుగా మార్చుతూ చట్టం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024లో ఇనాం భూముల క్రయ విక్రయాలను నిషేధం విధించిందని, అది సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి కుయుక్తులకు రైతుల చెక్



తోట పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): 'అన్నదాత పోరు' ఆందోళన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం చేసిన కుయుక్తులకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చెక్ పెట్టారని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట పృథ్వీరాజ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి పిలుపుమేరకు 'అన్నదాత పోరు' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైందన్నారు. రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చిన మండపేట నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రతి పంటకు రైతులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదంతా అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయాన్ని ఎగవేశారన్నారు. ఆర్థిక సాయం చేయకపోగా.. ప్రస్తుత పంటకు, సాగుకు కావాల్సిన సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్ని విధాలా వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్న కూటమిపై అన్నదాతల ఆగ్రహానికి నిదర్శనమే 'అన్నదాతా పోరు' విజయవంతమన్నారు. ఇకనైనా రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

సింగంపల్లి పీహెచ్సీ పరిధిలో ఫీవర్ సర్వే



సింగంపల్లి వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలం సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఫీవర్ సర్వే నిర్వహించినట్టు వైద్యాధికారి కె.సంకీర్తన తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్థానిక పీహెచ్సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. గ్రామాల వారీగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తున్నామన్నారు. జిల్లా ఏఎంఓ పి.శ్రీనివాసరావు, ఎస్యూఓ సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ పి. ప్రసాద్, ఎంపీహెచ్ఏ వీఎస్ గోవిందు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నారని తెలిపారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి సిద్ధం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని 64 రేషన్ షాపుల పరిధిలో 42,593 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం చేసినట్టు తహసీల్దార్ పి.తేజేశ్వరరావు బుధవారం తెలిపారు. వాటిలో 259 కార్డులు నూతనంగా మంజూరయ్యాయని, కుటుంబ సభ్యులు విభజన విభాగంలో కొత్తగా 510 కార్డులు మంజూరు కాగా, ఇప్పటికే ఉన్న కార్డుల్లో 1,992 మంది సభ్యులను చేర్చామని చెప్పారు.

తలకెక్కడం లేదా!

- వాహనచోదకుల్లో రాని మార్పు
- హెల్మెట్ వాడకంపై వల్లీలు
- బ్రాండెడ్ హెల్మెట్లతోనే ప్రయోజనం



అమ్మకానికి ఉంచిన హెల్మెట్లు

కె.గంగవరం: రహదారి ప్రమాదాల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. అందులో భాగంగానే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసుశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో వాహన రిజిస్ట్రేషన్కు హెల్మెట్ లింక్ తప్పనిసరి చేసింది. కానీ హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులు లైట్ తీసుకుంటున్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనకు అలవాటు పడడం లేదు. అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించినా ఫలితం లేదు. గతంలో ప్రభుత్వం హెల్మెట్ లేకుండా పెట్రోల్ పట్టొద్దని బంకు యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ విధానం ఎక్కడా అమలు కాలేదు.

కలవరపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ప్రధానంగా హైవే రోడ్లలో జరుగుతున్న ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. హెల్మెట్ ధరించి ఉంటే గాయాలతో బయటపడే అవకాశం ఉంటుందని రోడ్డు భద్రతా నిపుణులు గగ్గోలు పెడుతున్నా.. వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ఏటా జరిగే రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం వల్ల ప్రాణాలు వదులుతున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు మాత్రమే స్పాట్లో మృతి చెందుతున్నారు. కేవలం హెల్మెట్ వాడకపోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. ప్రభుత్వం, రవాణా శాఖ, పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాహనదారుల నుంచి సహకారం కొరవడుతుందనే మాటలు వినిపిస్తున్నాయి.

129 సెక్షన్ ప్రకారం..

మోటారు వాహన చట్టంలోని 129 చట్టం ప్రకారం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధన ఎప్పటి నుంచో అమలులో ఉన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో దేశమంతా ప్రస్తుతం హెల్మెట్ వినియోగంపై దృష్టి సారించింది. రోజురోజుకీ పెరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల కఠినం చేశారు. అయితే చాలా మంది వాహనదారులు హెల్మెట్ ఉన్నా పెట్టుకోవడానికి ఇష్టపడరు. ఆర్టీఏ, పోలీసు అధికారుల నుంచి తప్పించుకోవడానికి మరికొంత మంది వాహనం ముందు, వెనుక హెల్మెట్ ఉంచుతున్నారు. అధికారులు కేసులు రాస్తున్నట్లు కనిపించగానే నెత్తిన హెల్మెట్ పెట్టుకుని జంక్షన్ దాటేస్తున్నారు.

నాణ్యత లేని హెల్మెట్లతో ప్రయోజనం శూన్యం..

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నాణ్యత లేని హెల్మెట్లను కొనుగోలు చేయడం వల్ల ప్రయోజనం లేకపోగా ప్రమాదమే అధికమని అధికారులు సూచిస్తున్నారు. ఫుట్పాత్లపై లభించే హెల్మెట్ల వల్ల ధర తగ్గుతుందని ప్రాణరక్షణకు కనీస గ్యారెంటీ ఉండదని చెబుతున్నారు. చిన్ని, చిన్ని ప్రమాదాల్లో వాహనచోదకుడు కింద పడితే హెల్మెట్ పగిలి వాటి వల్ల గాయాలైన సందర్భాలు అనేకంగా ఉన్నాయి.

విస్తృత ప్రచారం అవసరం

హెల్మెట్ వాడకంపై ప్రచారం పెంచాలి. ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థ ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం చేసేలా ఆయా కార్యాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలి. పాఠశాలలు, కళాశాలల్లో హెల్మెట్ వాడకంపై విరివిగా అవగాహన తరగతులు నిర్వహించాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనచోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. యువత వాహనాలను నడిపే సమయంలో నిబంధనలు పాటించడం లేదు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులు, వాహనచోదకులు మోటార్ వాహన చట్టాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా వాహనాలు నడపాలి. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం విస్మరించరాదు.

– జానీబాషా, ఎస్సై, కె.గంగవరం

దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం



చెల్లూరులో రాటకు పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని చెల్లూరు అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్ర ఉత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఈనెల 22 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవాలకు అంకురార్పణగా రాట వేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాలిపర్తి పాపారావు, సభ్యులు భీమరాజు రామభద్రరాజు, మోటూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలింగి కిశోర్కు పలువురి పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణ కిశోర్ను బుధవారం మాజీ వల్లూరు పీఏసీఎస్ చైర్మన్ ముత్తాల సతీష్, తాతపూడి ఎంపీటీసీ జిత్తుక వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు శనివారపు అచ్చన్న తదితరులు ఆయనను పరామర్శించారు.

అంగరలో అన్నదానం

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీఆదిగణపతి నవరాత్ర ఉత్సవ శిబిరంలో బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్ర ఉత్సవాలకు అన్ని విధాలా సహకరించిన గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు, నాయకులకు నిర్వాహక కమిటీ చైర్మన్ పెద్దింశెట్టి సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనతో ఎయిడ్స్ అంతం



మాచరలో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, నిర్వాహకులు

కపిలేశ్వరపురం: అవగాహనతో ఎయిడ్స్ మహమ్మారిని అంతం చేయవచ్చని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం నిర్వాహకులు అన్నారు. మాచర గ్రామంలో ఎయిడ్స్ వ్యాధి కారణాలు, లక్షణాలు, తీవ్రత, నివారణ తదితర అంశాలపై అవగాహన, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం నూకపెయ్యి వెంకట్రావు, జోనల్ సూపర్వైజర్ జి.శ్రీనివాసరావు, లింక్ వర్కర్ సుజాత పాల్గొన్నారు.

బీజేపీ సేవా పక్షోత్సవాలు

రామచంద్రపురం: పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దునే శ్రీనివాసు అధ్యక్షతన పట్టణ సేవా పక్షోత్సవాల వర్క్షాపును బుధవారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ నెల 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడా–2025 పక్షోత్సవాల గురించి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కో కన్వీనర్ సలాది శేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రానున్న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవ ద్వారా ప్రజల్లో వారి జన్మదినాన్ని జరపాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు రాఘవేంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు గానాల కళ్యాణ్, సీనియర్ నాయకులు యంధ్ర బుల్లబ్బులు, కుప్పెల సూర్యనారాయణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణాలు అడ్డుకునేవారిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు సమస్య వివరిస్తున్న నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ శంకరనారాయణ

కాజులూరు: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణాలకు వ్యక్తిగత దురుద్దేశాలతో ఆటంకాలు కలిగిస్తున్న వ్యక్తులపై అధికారులు తగిన చర్యలు తీసుకుని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం కాజులూరులో శంకరనారాయణ, బీజేపీ జిల్లా ప్రచార విభాగం కన్వీనర్ రొక్కాల సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీసీ రోడ్లు తదితర నిర్మాణాలకు భారీగా నిధులు విడుదల చేస్తుందన్నారు. అయితే దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడులో కొందరు వ్యక్తులు పంచాయతీ అధికారులను, ఇంజినీరింగ్ సిబ్బందిని బెదిరిస్తూ గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు కలిగిస్తున్నారన్నారు. దీనిపై ఎంపీడీవో జే రాంబాబును కలసి పరిస్థితి వివరించామన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



రైతులతో మాట్లాడుతున్న ఏవో రమేష్కుమార్

రాయవరం: మండలంలో యూరియా కొరత లేదని, తగినన్ని నిల్వలున్నాయని మండల వ్యవసాయాధికారి రమేష్కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో పొలంబడి సమావేశాన్ని రైతులతో నిర్వహించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి దొరబాబు, తహసీల్దారు ఐపీ శెట్టి పాల్గొన్నారు. మండలంలో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే రైతులకు నానో యూరియా మార్కెట్లో అందుబాటులో ఉందని, గుళికల రూపంలో ఉన్న యూరియాతో పోలిస్తే ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా అధిక ప్రభావం ఉంటుందన్నారు. యూరియాకు బదులుగా ద్రవ జీవామృతం ఉపయోగిస్తే నేలకు కావాల్సిన నత్రజని మొక్కలకు అందించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. రబీ పంటకు భాస్వరం (సింగిల్ సూపర్ పాస్పేట్) ఎరువును నవంబరు చివరి వారంలో అందుబాటులోకి తీసుకురావాలని రైతులు వ్యవసాయాధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రావు, ఉప సర్పంచ్ ప్రదీప్ కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షుడు దేవళ్ల వెంకట్రావు, మాజీ సర్పంచ్ వేణుగోపాలదొర, రైతులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ



ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న జేఏసీ నేతలు

రామచంద్రపురం: నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో–కన్వీనర్ బత్తుల సిద్ధూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు, దొమ్మలపాటి సత్యనారాయణ, మాధవరపు వెంకటేశ్వరరావు, చందమామ వాసు, పాలపర్తి మధు, అంకం శ్రీనివాసరావు, నారపురెడ్డి బలరాం, గొల్లపల్లి కృష్ణ, పి.రాము, చీకట్ల వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ అమలాపురం కేంద్రం 60 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలు పరిపాలన సేవలు, జిల్లా కేంద్రానికి వెళ్లడం కోసం నిత్యం అవస్థలు పడుతున్నారని, గోదావరి నది కారణంగా తుపానులు, వరదల సమయంలో రవాణా పూర్తిగా ఆగిపోతుందని తెలిపారు. కాకినాడ కేంద్రం కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండి విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉద్యోగాలు అన్నీ అందుబాటులో ఉన్నందున రామచంద్రపురం ప్రజల జీవనాధారాలు సహజంగానే కాకినాడతో ముడిపడి ఉన్నాయన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రజల డిమాండ్ను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

ద్రాక్షారామ భీమేశ్వరుని సన్నిధిలో కలెక్టర్



కలెక్టర్ దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ అరుణ, సత్యం

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్కుమార్ రావిరాల పుట్టినరోజు పురస్కరించుకుని బుధవారం కుటుంబ సమేతంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందజేశారు. ఆలయం తరపున కలెక్టర్ దంపతులకుసర్పంచ్ కొత్తపల్లి అరుణ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ దేవరకొండ అఖిల, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, పెంకె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సౌజన్యంతో గుర్తింపు కార్డులు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని పీఎస్సీఎం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు. హెచ్ఎం ఎంవీ రాజు మాట్లాడుతూ, పాఠశాల ఉపాధ్యాయుల సౌజన్యంతో విద్యార్థుల గుర్తింపు కార్డులను తయారు చేయించామన్నారు. విద్యార్థులు గుర్తింపు కార్డులను ధరించడం ద్వారా సామాజికంగా గుర్తింపు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోళ్ల సాయిరాం, మాదేపల్లి శ్రీనివాసరావు, దేవళ్ల సాయిబాబా పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నుంచి మండల ఇన్చార్జ్ సస్పెన్షన్

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జ్ పదవి నుంచి ఉండ్రాజవరపు శివను సస్పెండ్ చేస్తూ జిల్లా ఇన్చార్జ్ సామ్రాట్ కేబీ మధు మాదిగ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల జగ్గన్నపేటలో జరిగిన ఆటో డ్రైవర్ సంఘటనలో ఎమ్మెల్యే సత్యనారాయణ సమక్షంలో జిల్లా ఎమార్పీఎస్ అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాదిగ మీద, ఆటో డ్రైవర్ మీద ఎఫ్ఐఆర్ వేయించమని ఎమ్మెల్యేకు మద్దతుగా నిలిచినందుకు ఎమ్మార్పీఎస్ నుంచి, మామిడికుదురు మండల ఇన్చార్జ్ బాధ్యతల నుంచి తొలగించారు.

బాధిత కుటుంబానికి సూర్యప్రకాష్ పరామర్శ



వాసాలరేవులో రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కో–ఆర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: మండలంలోని దంగేరు శివారు వాసాలరేవు గ్రామానికి చెందిన నాటి రాంబాబును జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు. ఇటీవల రాంబాబు మాతృమూర్తి కావమ్మ వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీంతో పాటు దంగేరు గ్రామానికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు పిల్లి సత్యనారాయణ మూర్తి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను కూడా పరామర్శించారు. మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వికలాంగులను వేధించడం దారుణం



చొల్లంగి బాల సూర్యప్రకాశ్

కాజులూరు: అర్హులైన వికలాంగులకు సర్వేలు, తనిఖీల పేరుతో నోటీసులు అందించి వారిని వేధించడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చొల్లంగి బాలసూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్లను ఇవ్వకపోగా ఉన్న పింఛన్లను పునఃపరిశీలన పేరుతో తొలగించేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమన్నారు. నోటీసులు జారీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని యథావిధిగా అర్హులందరికీ పింఛన్లు అందించాలన్నారు.

పశుపోషణ బహుభారం

- వేధిస్తున్న ఎండుగడ్డి కొరత
- పెరిగిన దాణా ధరలు
- రైతుల ఆందోళన



కాజులూరు పొలాల్లో మేస్తున్న పశువులు



సరైన దాణా, పశుగ్రాసం లేక నీరసించిపోతున్న గేదెలు

కాజులూరు: 'పల్లెల్లో పాడిపంటలు' అనే పదానికి కాలం చెల్లిపోతోంది. ఒకప్పుడు గ్రామాల్లో గుంపులు, గుంపులుగా సంచరించే పాడి పశువులు నేడు రైతుల ఇంట ఒకటి, రెండు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. పెరిగిన దాణా ఖర్చులు, వ్యాధుల భయం, ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో రైతులకు పాడి పోషణ భారంగా మారింది. పశుగ్రాసం కొరత, పెరుగుతున్న దాణా ధరలకు తోడు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రేయింబవళ్లు కష్టపడి పాడి పశువులను పోషిస్తే వచ్చే పాల దిగుబడి రోజుకూలీ కూడా సరిపడని దయనీయ పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని పోషించలేక కబేళాలకు తరలించాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పలువురు రైతులు అంటున్నారు. ఇటీవల సాగుచేస్తున్న పంటలు వరుసగా నష్టాలపాలవుతున్నాయని ఈ తరుణంలో పాడి పశువుల ద్వారానైనా కాస్త ఆదాయం వస్తుందనుకుంటే పాడి పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందని రైతులు దిగులు చెందుతున్నారు.

యంత్రాలతో పశుగ్రాసానికి ఇబ్బంది

ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను యంత్రాల ద్వారా కోత కోయించడంతో ఎండుగడ్డి పనికి రాకుండా పోయి పశుగ్రాసం కొరత తీవ్రంగా మారింది. డెల్టా ప్రాంతంలో పశుపోషణకు ఎండు గడ్డే ఆధారం. ఈ నేపథ్యంలో ఒక ట్రాక్టర్ ఎండు గడ్డి ధర సుమారు రూ.ఆరువేల నుంచి రూ.ఎనిమిదివేల వరకు పలుకుతుంది. పాడి పశువులకు అందించే గడ్డితో పాటు దాణా ఉలవపొట్టు, తవుడు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పశుపోషణ రైతులకు తీవ్ర భారంగా మారింది. తవుడు బస్తా ధర ఏకంగా రూ.2200 పలుకుతుంది. పశుగ్రాసం, దాణా తదితర ఖర్చులు రెట్టింపు కావడంతో పాడి పెంపకంతో రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతుంది. ఈ నేపథ్యంలో గేదెలను మేపడం వీలుకాక చాలమంది రైతులు ఒకటి రెండు గేదెలతోనే సరిపెట్టుకుని మిగిలిన వాటిని అమ్మేస్తున్నారు. ఒక గేదె పశుపోషణకు అయ్యే ఖర్చు పాల దిగుబడి కంటే అధికమవుతుందని వారంటున్నారు.

పెరగని పాల ధర

మండలంలో ప్రధానంగా గొల్లపాలెం, కాజులూరు, ఆర్యావటం, కోలంక, కుయ్యేరు, జగన్నాధగిరి, పెనుమళ్ల, మొగలిపాలెం తదితర గ్రామాల్లో వందలాది మంది రైతులు పాడి పశువుల పెంపకంపైనే వారి కుటుంబాలు పోషించుకుంటున్నారు. పశుపోషణకు ప్రభుత్వం ఏరకంగా సహాయం చేయకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో ఉన్న పశువులను అమ్ముకోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల డైరీలో పది పాయింట్లు వెన్న శాతం చూపిస్తేనే లీటరుకు రూ.60 ధర చెల్లిస్తున్నారు. వెన్న శాతం తక్కువగా ఉన్న పాలకు రూ.40 నుంచి రూ.45 మించి చెల్లించడం లేదు. పశువుల పోషణ, మేత ఖర్చులకు వచ్చే రాబడి ఏమాత్రం సరిపోకపోవడంతో రైతులు పశువులను కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి



బయట మార్కెట్లో పాలకు ధర ఉన్నప్పటికీ రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదు. పాలు పలచగా ఉన్నాయని వెన్న శాతం తక్కువగా ఉందని డైరీ వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పెరుగుతున్న దాణా ఖర్చులకు అనుగుణంగా ధర కల్పించాలి.

– నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, రైతు, మొగలిపాలెం

ప్రభుత్వం సబ్సిడీపై దాణా సమకూర్చాలి



గ్రామాల్లో పశువైద్య సేవలను మెరుగుపరచి పశువులకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించటంతో పాటు ప్రభుత్వం చిట్టు, తవుడు తదితర దాణాలను రైతులకు సబ్సిడీపై అందించాలి. పాల దిగుబడి పెరిగేందుకు పశువులకు పౌష్టికాహారాన్ని సమకూర్చాలి.

– కాకి శ్రీనివాసరావు, రైతు, మతుకుమిల్లి